కథానిక:

# వానవెలిసింది

★

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

విపరీతమైన వర్షాలు. అందరూ ఖాళీ వాన వస్తుందేమో అని భయపడ్డారు. ఏరుల్లాగ పారుతున్నాయి వూళ్లో వాగులు. కొంచెం పొలిమేర దాటితే యెటు చూసినా సముద్రంలాగ కనిపిస్తోంది. కొట్టుకుపోయిన పశువులు అంతేలేదు. ఇక గ్రాసము సంగతి చెప్పే దేముంది. తిండికి గింజలు అట్టే పెట్టుకుంటే అవి కాస్త గంగ పాలయినాయి. ప్రతీవాళ్లు ఒకటే గోల. ఏ కొంప చూసినా నీటిమయం. చెదురు వాటుగా నాలుగు మేడలుమాత్రం వున్నాయి ఆ వూళ్ళో. ఆ మేడల్లో కూడ వర్షపు ధారే. ఇక మండువా కొంపలమాట చెప్పే దేముంది. అందులో వీరాస్వామిది మండువా యిల్లే. పెద్ద రైతు అవటంవలన, వీరాస్వామికి ఎనిమిది జతల యెడ్లు, నాలుగు దున్నలు, యింకా ఆవులు, గేదెలు వున్నాయి. అన్నిటిని ఆ పెద్ద చావిడిలోనే కట్టేశాడు. ఆ చావిడి కాస్త కూలుతుందేమొ యీ వాన సామాన్యంకనకనా, అన్యాయంగా పశువులప్రాణం మనం తీసిన వాళ్లం అవుతాము అని పశువులనన్నిటిని విప్ప తీశాడు యీ వాన రావడంతోనే. ఆ వాన్లోనే పశువులన్నీ తిరిగినాయి. ఓ మూడి గేదెమాత్రం యీ వాన భరించలేక ఆ చావిడిలోనే కూలబడింది. వీరాస్వామి అనుకున్నట్లుగానే ఆ చావిడి కాస్త కూలింది. పాపం ఆ గేదె అరుపు వింటుంటే చుట్టుప్రక్కలవాళ్ల గుండెలు తరుక్కుపోయినాయి. బిడ్డ, గొడ్డు అన్నారు. పాపం అనేవాళ్లేగాని ఒక్కళ్లు బైటకు సాహసంగా వచ్చినవాళ్లు లేరు. ఎవరి ప్రాణం వాళ్లకు తీపి. వీరాస్వామి వెళుతుంటే, 'నీ వక్కడివల్ల యేమవుతుందిరా ఆ చావిడి యెత్తగలవా యేమిటె. దానికి ఋణం తీరి పోయింది. వెళ్లద్దు బాబూ' అని వాళ్ల నాయనమ్మ మందలించింది.

వీరాస్వామికి మొదటినుంచి బంధుప్రేమ యెక్కువ. 'బ్రతికున్నంతవరకే బంధుత్వము. తర్వాత నువ్వెవరో నేనెవరో. కావలసినంత పాడి పంట వుంది కదా. చేతి క్రింద పాలేళ్లు 'ఊ' అంటే పలుకుతారు. రుక్కమ్మనూ తీసుకువస్తాను పురిటికి పంపించు అత్తా అని బలవంతంచేస్తే 'సరే' అంది రామసుబ్బమ్మ మేనల్లుని మాటలు కాదనలేక. అన్ని హంగామాలతో నాలుగో పురుడైనా గంగమ్మను తీసుకు వచ్చాడు. చెల్లెలినే తీసుకువచ్చినవాడు కూతురి విషయంలో చెప్పేదేముంది. అందులో తొల్చూరేను. రుక్కమ్మనూ తీసుకు వచ్చాడు. అన్ని హంగామాలతో ఎవరు తీసుకొస్తారమ్మ ఆ వీరాస్వామి కాబట్టి నాలుగో పురుడైనా గంగమ్మను తీసుకు వచ్చాడట. ఆయన ప్రేమయెక్కడ; ఆయన యెక్కడ. 'మన రంగమ్మ అవుతేనా' అని ప్రక్క యింటావిడ అంటే 'ఆ, రంగమ్మ బ్రతుకు నా బ్రతుకు చెప్పాల్సిందే' అని ముఖం చిట్లించింది తోడుకోడలు.

వీరాస్వామికి తండ్రి లేడు. తల్లి జబ్బు మనిషి. నాయనమ్మ మంచంలో వుంది యెప్పుడు పిలుపు వస్తుందా అన్నట్టు. ఈ వర్షం ముందు 'అవతల యింట్లో ఓ అబ్బాయి పోతే ఆ చావు నాకు రారాదు. పండంటివాణ్ణి యెత్తుకుపోయినావు, అని యేడ్చింది. ఎంత పల్లెటూరు అయినా వీళ్ళందర్నీ పోషించాలంటే యీ రోజుల్లో తల ప్రాణం తోకకు వస్తుంది. ఈ మధ్యనే రత్తమ్మ మొగుడు యింట్లో పోట్లాడి, చెప్పకుండా లేచిపోతే, ఆ చెల్లెల్ని కూడ తీసుకు వచ్చి యింట్లో పెట్టుకున్నాడు. తప్పుతుందా తల్లి తోడు అన్న తర్వాత. అదీగాక తాకిడి యెక్కువ. వచ్చే చుట్టాలూ; పోయే చుట్టాలూ మోహం అంటూ యేదైనా వుంటేనే. వాళ్ల అన్నయ్యకు యేముంది యీ జంఝాటన. పంచుకున్నాడు, వెళ్ళి బస్తీలో కాపరం పెట్టాడు. వీరాస్వామి వీరాస్వామి అంటూ అందరూ యీయన యింటికే వస్తారు. బస్తీ చుట్టాలు కనకనా, ఓ పూట వచ్చి రెండో పూట హోటల్లో భోజనం చెయ్యటానికి. పౌర్ణమి ముందు వచ్చారంటే అమావాస్య వెళ్ళేదాకా వుండాల్సిందే. ఈ మధ్యనే వాళ్ల పినతల్లి వినాయకచవితికి వచ్చి, నాగుల చవితికి యింటికి వెళ్లింది. నిండుకుండలు యెట్లా చెంబెడు నీళ్లుపోసి పంపిస్తావో వీరాస్వామి తండ్రి వెయ్యిదేవుళ్లకు మొక్కుకుంటున్నా అంటూ ఆ మంచంలోవున్న ముసలమ్మ ఒకటే గోల రోజు. వీరాస్వామికి అంత దిగులువుండేది కాదు యింత పెద్దవర్షము అతాత్తుగా రాకపోతే. ఇప్పుడేమి చేస్తాడు ఇంటినిండ గంపెడుజనం. బైట చూద్దామా పశువులు అల్లాడిపోతున్నాయి. ఏడాది గ్రాసం యేటిపాలయింది. రుక్కమ్మకు తొమ్మిదోనెల ప్రవేశించింది. గంగమ్మకు యివ్వాళో రేపో పురుడు వస్తుందనుకుంటున్నారు. పిలిస్తే పలికే దిక్కు లేదు. ఎవరి గొడవ వాళ్లది. మా కోళ్లన్నీ చచ్చినాయని. మా కొంప కూలిందని, మా ఆవు కనిపించటంలేదు, అంటే, మా గేదె కనిపించటం లేదని యీ వరసగా వుంది. 'పోన్లే అమ్మ ఘటాలు తిన్నగావుంటే అదే పదివేలు. లేకపోతే యింత అడుక్కుతింటారు. దేశంమీద యెంతమంది లేరు. పోన్లే దొరికారుకదా యిప్పుడు కాకపోతే యింకాసేపటికి వస్తారు' అని ఓ తల్లిని ఓదారుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యెవరి సహాయం యెవరికుంటుంది! వీరాస్వామి మొదటినుంచి దూరాలోచన కలవాడు కాబట్టి సన్నాలు రెండుపుట్లు పురికట్టి మంచి బందోబస్తయిన కొట్లో పోశాడు. నలుగురం గలవాళ్ళం. ఇంట్లో పెద్దది ముసలమ్మ వుంది యెట్లా పోయి యెట్లా వస్తుందోఅని. ఆ వూళ్లో అందరికి వీరాస్వామి అంటె ఓవిధమైన గురి. పాపం ఆ వీరాస్వామి గడ్డివాములన్నీ కొట్టుకొని పోయినాయి, లేకపోతే మనకు గడ్డికి కరువా. ఆయన నోటితో లేదని యెరుగడుకదా పుణ్యాత్ముడు. ఇక భగవంతుడు రక్షించాలి. పాపం పురిటికి తీసుకువచ్చాడు యిద్దర్ని అని జాలిపడ్డారు. వీరాస్వామి పెళ్లాంకూడ వీరాస్వామికి తగిందే. మగాడు యెంతమంచివాడైతే ఆడది యిట్టే మూతి విరిచిందంటే కొంప లంటుకున్నాయే. అందుకనేగా, యీమధ్య వీరాస్వామి, వాళ్ళ అన్నయ్య యింటికి వెళ్ళితే, రాక రాక తమ్ముడు వచ్చాడుగదా పల్లెటూరు నుంచి అని అవిచెయ్యి, యివి చెయ్యి అని యింట్లోచెప్పి, యిట్టే బజారు చూపించటానికి వెళ్లితే, యింటికి వచ్చేటప్పటికి యెక్కడ గిన్నెలు అక్కడ వున్నాయి. చచ్చినట్టు వంట ప్రారంభించారట, వచ్చినతర్వాత కాశీ కెళ్లినా ఖర్మం తప్పలేదన్నట్టు. ఇట్లా చేస్తావు అనుకోలేదు వదినా అని వీరాస్వామిఅంటే, అవును తలకాయ నొప్పితో చస్తున్నా నీ పెళ్లాంచేత చేయిస్తావు గామాలు, నాకా ఓర్పు లేదు

నాయనా అంటూ తోడుకోడల పగంతా అక్కడే వెళ్లబుచ్చిందిట. ఒక్కరెక్కన ఆ సుంకరమ్మ కోడి కూసింది మొదలు దీపాలు పెట్టేవరకు ఒకటే చాకిరి, నలుగురున్న కొంపేను, అంతా భూదేవి అన్నారు. పాపం అత్తగారు సుస్తీ మనిషేను. అయినా నేను పొయ్యిదగ్గర కూలబడితే, నాకు చేతయింది యింత వుడకేసి పడేస్తానమ్మా, నువ్వు పొయ్యిదగ్గరకురాక సుంకరమ్మ తల్లి నీ చాకిరి చూడలేకుండా వున్నా నువ్వెక్కడ మంచాన పడతావో అని నాకు భయంగా వుండే. రత్తమ్మను కదిల్చి గెలవలేంకదా అంటూ వుండేది. అత్తయ్యా అంత బాధపడుతూ మీరు పొయ్యిదగ్గరకు రాకపోతే నేను చెయ్యలేనేమిటి. ఇదిగో అయిపోయిందిగా ఇంకేముంది. ఆ బట్టలు వుతికి, ఆ నాలుగు బిందెల నీళ్లు తెచ్చి యింట్లో పడేశానంటే, యిక పొయ్యిదగ్గరకు పోవటమే. కొంచెం ఆలస్యం అయితేయే బుడ్డాళ్ళకు అన్నంపెట్టాలేదా అని సుంకరమ్మ సమాధానం చెప్పేది.

నువ్వొక్కత్తివి యింత చాకిరి చేస్తున్నావుకదా, రత్తమ్మకేమొచ్చింది కూయగోగను. రెండుపూట్ల రెండింతలు తింటుంది; ఓశక్తిలాగ కూర్చుంటుంది. ఇంత చేదోడు వాదోడుగా వుంటే యెంత సంతోషంగా వుంటుంది నా ప్రాణం అని విసుక్కునేది వీరాస్వామి తల్లి. అట్లా అనకండి అత్తయ్యా పాపం వదిన కాపరం వదిన చేసుకునేదేనా యింతకీ యిక్కడ పడి వుండాల్సిన గతి పట్టింది. వదినను చూస్తే నాకు జాలేస్తోంది. ఆవిడనుమాత్రం యేమి అనకండి అని రత్తమ్మమీద యీగ వాలనిచ్చేదికాదు సుంకరమ్మ. మీకేమివచ్చింది పిలుస్తే పలకేరేమిరా అని మంచంలో ముసలమ్మ గోలపెడుతుంటే ఆ ఆలకింపుకు సుంకరమ్మ రావాల్సిందె, ఎప్పుడైనా, యేమిటే అమ్మాయి వక్కపనికిరావు అంటె, అవును నేను చాకిరీకి పుట్టాను. అక్కడ వున్న నాలుగురోజులు సుఖం యెరగనూ బండచాకిరీ చేశాను. ఇక్కడకొస్తే మీరు సాధింపు. నా జీవితము అంతా యింతే. ఇంతకంటె చస్తే మేలు. ఆడదాని జీవితం మగవాడు లేకపోయిన తర్వాత యేమిటి అని బావురుమనేది రత్తమ్మ. కన్నకడుపేను. తల్లిమనస్సు కరిగేది. ఏది కాదనగలదు!

వీరాస్వామి మంత్రసానిని తీసుకువచ్చాడు. గంగమ్మకు పురుడు వచ్చింది. మండువాప్రక్కనే దుప్పట్లుకట్టి ఓగదిలాగ యేర్పాటు చేశారు. దాంట్లోనే పురుడు. దానికి యెడంచేతివైపు రెండు మూడు గజాల దూరంలో ముసలమ్మ మంచం. ఆ మంచానికి యెదురుగుండా మూలుగుతూ వీరాస్వామితల్లి. దానిప్రక్కన పురికట్టిన గది వుంది కదా, మిగతా రెండుగదులు వర్షపుధారేను. ఈపిల్లలు ఒకచోట కూర్చుంటారా, పెట్టితారా అటురాను, యిటురాను. రత్తమ్మ వంటింట్లోంచి కదలదు. రుక్కమ్మకు కూడ పురుడువచ్చేరోజులే. ఎట్లాగా యెక్కడ యేర్పాటుచేద్దామా అని వీరాస్వామి బుఱ్ఱ తిరిగిపోతోంది. వంటిల్లు చూద్దామా అంటే, నాలుగు తడవలుగాని యింట్లోవున్నవాళ్లు అన్నం తింటానికి వీల్లేదు యీవర్షం మూలాన. గొడ్లసావిడి కంటె కనాకష్టంగా వుంది. మగాడు కాబట్టి వీరాస్వామి యింట్లో వుండేవాడు కాదు అట్టే, ఆ భోజనం వేళకు వచ్చేవాడు. ఈ వర్షంవలన వీరాస్వామికూడ చాలావరకు యింట్లోనే వుంటూవచ్చాడు. సరే ఆడవాళ్లు అస్తమానం కొంపలో పడి వుండాల్సిందేగా పొయ్యికి వాళ్లకి లంకేను. ఏం నాయనమ్మా నీ మంచం వాయిట్లో పెట్టమా అక్కడ ఓ దడిఅంటిది ఏర్పాటు చేస్తాను. రెండు కంబళ్లుకూడ యిస్తాను. అని వీరాస్వామి అంటే, అవును పెట్టండి పెట్టండి. ఈ పాటికే పెట్టాల్సింది నన్ను. మిమ్మల్ని మిమ్మల్ని బాధపెట్టటానికి బ్రతికాను. ఎందుకొచ్చినబ్రతుకు ఎవరు సంతోషించరు అంది ముసలమ్మ. వీరాస్వామి మనస్సు చివుక్కుమంది. గత్యంతరము లేదు వూళ్లో రంగయ్యగారింటికి వెళ్లి అడిగాడు, 'ఎక్కడ పెట్టతావు నాయన చూస్తున్నావుగదా కొంప. రుక్కమ్మ పురుడుపోసుకుంటేనాకు బరువా. స్నేహితులు స్నేహితులు యెవరికిలేని స్నేహితులు యీయనకు వచ్చారు గామాలు. చస్తున్నాం కూర్చుంటే నుంచోటానికి లేదు, నుంచుంటే కూర్చోటానికి లేదు అంది రంగయ్యగారి భార్య. చచ్చినచావుగా వుంది వీరాస్వామికి. ఎన్నడు 'దేహి' అని యెరుగడు. ఈసారి అడిగినట్టుగానే లేదన్నారు. బాలింతరాల్ని నీళ్లల్లో త్రిప్పకూడదంటారు యేంచెయ్యను పరమాత్మ అని ఓ అయిదునిమిషాలు ముఖం మోకాళ్లమీద పెట్టి రెండు చేతులతో మోకాళ్లను కౌగలించుకొని పిచ్చివాడులాగ కూర్చున్నాడు. 'వీరాస్వామిగారు, రుక్కమ్మ నొప్పులుపడుతోందిట అమ్మగారు నిన్ను తొందరగా తీసుకురమ్మన్నారు, అని ఒక వార్తాహరుడు వచ్చాడు. వీరాస్వామికాళ్లు తడబడతూ గబగబ యింటికి వచ్చాడు. అమ్మాయి రుక్కూ! నిన్ను పురిటికి తీసుకువచ్చాను. సుఖంగా ఆ నీళ్లుపోసి యెట్లా పంపిస్తానో మీ యింటికి. నీ అత్తారింట్లోవున్నా, బస్తీయేను సుఖంగా పురుడుపోసుకొనే దానివి. ఎటూకాకుండా యిట్లా తెచ్చిపెట్టానే అమ్మాయి అని యీసారి కొంచెం విచారంగా మాట్లాడాడు. అదేమిటినాన్న అట్లా అంటావు. ఎంత బస్తీఅయినా అమ్మ నాన్న దగ్గర వున్నట్లు వుంటుందా అంది రుక్కమ్మ. సుంకరమ్మ రెండు కన్నీటిబిందువులు ముసలమ్మ కాళ్లమీద పడ్డాయి. ముసలమ్మ వులిక్కిపడింది వీరాస్వామి మాత్రం చూశాడు ఆవిడ కళ్లల్లోకి. ఇద్దరూ అట్లాగే నిలబడ్డారు. ఇంతలో అమ్మ అనే శబ్దం వినిపించింది. ఎవరమ్మ అంటూ వీరాస్వామి వాయిట్లోకి వెళ్లాడు. ఇందాక మీరు సూరమ్మత్తని గది అడిగారట. లేదని చెప్పటానికి చెడ్డ సిగ్గేసిందని చెప్పింది. మా యిల్లు ఖాళీగానే వుంది. ఈ వానకుముందే మావారు, వెంకయ్యమామ పట్నానికి వెళ్లారు. మా యింట్లో నేను, మా అత్తయ్యాను. మా అత్తయ్య మిమ్మల్ని తీసుకు రమ్మంది అని చెప్పింది. నిజంగా దేవుడు నిన్ను పంపాడమ్మ మమ్మల్ని కాపాడటానికి. ఇప్పుడే వస్తున్నాము అని సుంకరమ్మ బయలుదేరిపోతోంది కూతురిమీద వుండే ప్రేమలో. వీరాస్వామి యేమి మాటా


తెలుగు మెఱుగులు

గ్రంథకర్త:
వేటూరి ప్రభాకరశాస్త్రి
వెల రు. 2-0-0
తపాలా ఖర్చులు 0-7-0
మేనేజరు- ఆంధ్రగ్రంథమాల,
నెం. 7, తంబుచెట్టి వీధి, మదరాసు-1.

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

డలా. తల్లిమాత్రం 'ఏరా అబ్బాయి ఆ పార్వతమ్మ యింటికి యే ముఖం పెట్టుకు వెళ్లతాం. వాళ్ల కుటుంబం సంగతి నీకు తెలీదు!' అంది చాటుగా. అవును అన్నట్టు తలవూపాడు వీరాస్వామి. ఏమిటత్తయ్యా అవన్నీ పెట్టుకుంటే ఎట్లా కుదురుతుంది. ఇప్పుడు పురుడువస్తే చేసేప నేమిటి. తొందరగా వెళ్లటం మంచిది అని సుంకరమ్మ తొందర పెట్టింది. కూతురిమీద వుండే ప్రేమ వీరాస్వామికి 'ఊ' అనిపించింది. గబగబ పార్వతమ్మ యింటికి వెళ్లారు. పార్వతమ్మ యింటికి వీరాస్వామి కూతుర్ని పురిటికి తీసుకు వెళ్లారు అనే వార్త నిమిషంలోకి ప్రాకిపోయింది వూరంతా. వీరాస్వామి యిట్టే గొల్లసావిడిదగ్గరకు వెళ్లితే ఒకావిడ వీరాస్వామిఅన్నా, కాకిచేత కబురు పంపిస్తే మా యిల్లు యివ్వకపోయినాన. చూస్తూ చూస్తూ ఆ పాడు పార్వతమ్మ యింటికి తీసుకుపోయినావే. నిండు ప్రాణాన్ని నూతిలోత్రోసి, అదే పడిందని కోర్టులో చెప్పలా. ఒకటిచేసి ఒకటి చెయ్యకుండా వుందా. వూళ్లో యేమనుకుంటున్నారో తెలుసా అంది. ఏమనుకుంటే యేం నేను చేసింది తప్పా వాళ్లు రమ్మని పిలిచారు అవసరానికి వెళ్లాం. పథ్యం పెట్టంగానే తీసుకువస్తాను యింటికి, వేరే రెండు నిట్టాడుల చోపా వేయిస్తున్నాను అక్కడ వుంటాము అన్నాడు.

రుక్కమ్మకుకూడ పురుడు వచ్చింది. గంగమ్మ పెద్దకూతురు అక్కడేవుంది. పురుడొచ్చిన సంగతి తెలియగానే యింటికి వెళ్ళి అమ్మో అమ్మో రుక్కమ్మ వదినకు కూడ ఆడపిల్లేనే అంది. ఆడపిల్లయినా అందరూ సంతోషించారు. ఇంకేం మన రామన్నకు పెళ్లాం పుట్టిందన్న మాట అని అప్పుడే మంచాన ముసలమ్మ మూడుముళ్లు వేసింది. రత్తమ్మ ముఖం చిటచిట లాడింది. వీరాస్వామి తల్లి, గంగమ్మ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

పురిటి నాలుగోరోజునే, యింటిదగ్గర పాక తయారవటంవలన, రుక్కమ్మను యిక్కడకు తీసుకువచ్చాడు. వర్షాలు వెనకబడ్డాయి. సూర్యరశ్మి అప్పుడప్పుడేవస్తోంది. తూనీగలు అంతూ, పొంతూ లేవు. ఊళ్లో పిల్లలంతా, వీరాస్వామి దొడ్లో బాదంచెట్టు పడిపోవటంవలన యిక్కడికే చేరారు. ఎంత పెద్దవాన ఎంత పెద్దవాన అంటూ, వూళ్లో వాళ్లు వానలనుగురించిన కథలనువిపరీతంగా చెప్పుకోవటం ప్రారంభించారు. అప్పుడు వాననుగురించిన విషయాలు యెవరెక్కువ చెపితే వాళ్లుగొప్ప అన్నమాట. వీరాస్వామి కొన్ని పశువులను అమ్మేశాడు గ్రాసం లేదుకదా ముందేడు కొనచ్చులే దేవుడు తిన్నగాచూస్తే అని. పాడికి కావలసిన రెండు గేదెలు, ఒక ఆవు మాత్రం వుంచాడు. పొదుపుగా దాచిన జనపకట్టే వేస్తున్నాడు వాటికి. ధైర్యం చేసి తెచ్చినందుకు మాట దక్కింది అని అందరూ సంతోషించారు.

గంగమ్మ చిన్నకొడుకు పుట్టినరోజు. అందరూ అన్నాలు తిని మధ్యాహ్నం సావిట్లో కూర్చున్నారు. రుక్కమ్మ పిల్లని తొట్లో పడుకోపెట్టింది. గంగమ్మ వళ్లో పడుకోపెట్టుకుంది. ముసలమ్మ యివ్వాళ లేచి కూర్చుంది ఆరునెలలకు. సుంకరమ్మ సావిట్లో ముగ్గులు పెట్టుతోంది. రత్తమ్మ వంటింటి గడపలో కూర్చుంది. వీరాస్వామి తల్లి మూలుగుతూ కొడుకుతో, అన్నీ బాగానే వున్నాయి. ఆ సీతయ్యకూడ వస్తే బాగుండును. ఇంట్లో పోట్లాడి వెళ్ళటం యెందుకు, అంతగా అక్కడ వుండటం యిష్టంలేకపోతే మన యింట్లోనే వుండేవాడు. పండంటి కాపరం చెడకొట్టుకోవటం యెందుకు. రత్తమ్మనుకూడ తీసుకు వెళ్ళినా బాగుండేది. ఏరా నాయనా కిష్టయ్యను పంపానన్నావు వానలు వెనకపడ్డాయి కదా యింకా రాలేదే అంది. నిన్ననే పాలేరును కూడ పంపాను వాళ్ల సంగతి కనుక్కోటానికి అన్నాడు వీరాస్వామి. తొందరడితే వస్తాడులే, వెళ్లటం అవుతే నిమిషాలమీద వెళ్లాడుగాని అని ముసలమ్మ అందుకుంది. రత్తమ్మ వంచినతల యెత్తలా.

"అమ్మా కిష్టప్ప వచ్చాడే"

ఏం కిష్టప్ప. మా సీతయ్య జాడ యేమన్నా తెలిసిందా. రత్తమ్మ కాపరం కూలపడిపోయింది గదా, నువ్వొస్తావని వేయికళ్లతో యెదురుచూస్తున్నాం అంది వీరాస్వామి తల్లి.

'వచ్చేవాణ్ణే నమ్మా ఎంత వాన ఎంత వాన మురుగెత్తిపోతే.'

'అసలు విషయం చెప్పవయ్యా ఏమన్నా కనిపించాడా ఎక్కడున్నాడు, ఎప్పుడొస్తానన్నాడు?'

'ఏం చెప్పనమ్మా. వూళ్లన్నీ తిరిగి తిరిగి గాలించా యెక్కడా కనిపించలా. అసలు జాడ తెలియందేనా.'

'ఇదేమిటి కిష్టప్పా, నువ్వేదో శుభవార్త తెస్తావని నోళ్లు తెరుచుకు కూర్చున్నాం. దేవుడి చేసేవి కొన్ని, మనం తెచ్చిపెట్టుకొనేవి కొన్నా. నిక్షేపంలాంటి కాపరాన్ని చెడగొట్టుకొని యెందుకు వెళ్లినట్టు'

ఇంతలో వీరాస్వామి అనే హీనస్వరం వినిపించింది. గబగబ వీరాస్వామి ముసలమ్మ దగ్గరకు వెళ్లాడు. అప్పుడు ముసలమ్మ 'వీరా! నీ ధైర్యము, నీ భక్తే నిన్ను కాపాడుతూ వుంటుంది. నేను మంచం యెక్కి నాలుగేళ్లయినా యీ సుంకరమ్మ, సుంకరమ్మా ఓసారి యిటురా అమ్మ, నువ్వు చేసిన చాకిరేనా నన్ను పువ్వుల్లో పెట్టి చూశావే సుంకరీ! నీకడుపు చల్లగా నీకు మగపిల్లాడు కలిగి, మీ వంశం వృద్ధిపొంది మీరు సుఖంగా వుండాలే అదే నా చివరి కోరిక. మీ యిద్దరు నాదగ్గరకు రండి. ఒకసారి యిద్దరు నవ్వండి' అని యిద్దరిమీద తలో చెయ్యి వేసి, ఆ నవ్వులో తన ప్రాణాన్ని కలిపి యీ అనంతమైన ప్రపంచాన్ని ఆవరించిన ఆ గాలిలో లీనమైపోయింది. ఒక్కసారి కొంప ఘొల్లుమంది.

గబగబ ఏమయింది ఏమయింది అంటూ వాకిట్లోనుంచి ఓ వ్యక్తి ఆదుర్దాగా వచ్చాడు యింట్లోకి. ఆయనే సీతయ్య.

★

ఉత్తమ శైవమత గ్రంథము

# పండితారాధ్యచరిత్ర

**వెల రు 5-0-0 లు.**

ప్యాకింగు పోస్టేజి 1—4—0

**ఆంధ్రగ్రంథమాల**

ఒక ప్రసిద్ధరచయితదగ్గిరికి ఒకడు వచ్చి తనకి కూడా కథలు రాయాలనుందనీ, రాయవలసిన విధానం చెప్పమనీ కోరాడు.

"ఎడమనుంచి కుడివేపుకి రాయడమే మంచిపద్ధతి," అని సలహా వచ్చింది.